# నీతిబాహ్య పద్ధతుల్లో విస్తరణకు పాల్పడుతున్న వాల్‌మార్ట్ కార్పొరేషన్

**కార్పొరేట్** యాజమాన్యాలు తరచుగా 'కార్పొరేట్ నీతి సూత్రాలు' 'కార్పొరేట్ సామాజిక బాధ్యత'ల వంటి నినాదాలను తమ గొప్ప సుగుణాలుగా అభివర్ణించుకుంటూ వుంటాయి. ఈ యాజమాన్యాలు అందించే 'సేవలకు', తయారుచేసే సరుకులకు వినియోగదారులుగా వున్న ప్రజానీకం ఎదుట, బడాపెట్టుబడిదారీ వర్గానికి చెందిన ఈ బడా బహుళజాతి కార్పొరేషన్ కంపెనీలు తమను స్వచ్ఛశీలురుగా, నీతిమంతులుగానూ, తాము న్యాయంగా వ్యవహరిస్తున్నామని చూపెట్టు కోవటానికి, ఆవిధంగా వారిని వంచించటానికి ఉద్దేశించినవే ఈ బడాయి నినాదాలన్నీ.

అయితే, ఆచరణలో తమ సూపర్ లాభార్జనా వేటలో ఈ బహుళజాతి కంపెనీలన్నీ అంతులేని నీతిబాహ్య విధానాలకు పాల్పడుతూ వస్తున్నాయి.

ప్రపంచంలోని బహుళజాతి పరిశ్రమలలో వాల్‌మార్ట్ పేరుమోసిన అతిపెద్ద కంపెనీ. ఇది తనవద్ద పనిచేసే కార్మికుల శ్రమశక్తిని వివిధ రూపాల్లో దోపిడీ చేసుకోవటంతోపాటు, తనకు ఆహార ఉత్పత్తులను, పంట ధాన్యాలను సరఫరా చేసే వివిధ దేశాలలోని వారందరికీ అతి తక్కువ ధరలను చెల్లిస్తోంది. మరోవైపున ఈ సరుకుల కొనుగోలుదారుల (వినియోగదారుల) నుండి అధిక ధరలను పిండుకుంటోంది. అంతేగాక, ఇది వివిధ దేశాలలోకి చొరబడటానికి ఆయా దేశాల ప్రభుత్వాధినేతలనుండి, ఉన్నతాధికారుల నుండి అనుమతులు సంపాదించటానికి (తన సరుకుల అమ్మకానికి, స్థానిక సరుకులను పెద్దమొత్తంలో కొనుగోలు చేయటానికి, శ్రామికులను నియమించుకోవటానికి మొ॥) లంచాలకు పాల్పడుతోంది. మధ్యదళారీల ద్వారా అనుమతులు పొందడానికి వాల్‌మార్ట్ యాజమాన్యం లంచాలు ఇవ్వటానికి ఏవిధంగా పాల్పడుతోందో తెలిపే ఉదంతమొకటి ఇటీవలే వెల్లడైంది.

వాల్‌మార్ట్ కంపెనీ ప్రపంచంలోని వివిధ దేశాలలో తన మార్కెట్లను తెరుచుకునేందుకు దశాబ్దకాలం పైగా నుండి దళారీలను వినియోగించి అవినీతికర, అక్రమపద్ధతులకు పాల్పడుతోంది. బ్రెజిల్‌లోని వాల్‌మార్ట్ కార్పొరేషన్ కార్యాలయంలోపల, వివిధ దేశాలలో సులభంగా, వేగంగా ప్రభుత్వ అనుమతులను పొందేందుకు 'సోర్సెరెస్' అని పిలవబడే శాఖ వుంది.

'ప్రభుత్వంతో సంబంధాలు-సంప్రదింపుల సేవల' పేరిట వాల్‌మార్ట్ సంస్థ చైనాలో స్థానికుడైన ఓ భూస్వామికి కొంత డబ్బును లంచంగా అందజేసింది. అలాగే మెక్సికోలో తాను నూతనంగా తన మార్కెట్లను తెరవాలను కుంటున్న ప్రాంతాలలోని ప్రభుత్వ అధినేతలు, ప్రభుత్వశాఖాధిపతులకు కంప్యూటర్లు, కార్లను బహుమతులుగా అందజేసింది. మనదేశంలో లంచాలు అందజేయడం, 'చట్ట విరుద్ధంగా పరోక్ష' రూపంలో చేసింది. 'మిస్‌లేనియస్ (ఇతరములు)' 'వృత్తి నిర్వహణ రుసుము', 'యాదృచ్ఛికము', 'ప్రభుత్వ రుసుం' మొదలైన అస్పష్ట వర్ణనలతో సంయుక్త భాగస్వామ్య పుస్తకాలలో, రికార్డులలో నమోదుచేయటమనే రూపంలో ఇక్కడ లంచాలను అందించింది.

2012 సం॥లో 'ది న్యూయార్క్‌టైమ్స్' పత్రిక-మెక్సికో నగరంలోని అధికారులకు వాల్‌మార్ట్ యాజమాన్యం అనుమానాస్పదమైన చెల్లింపులు చేసిందని, కంపెనీ కేంద్ర కార్యాలయంలోని ఉన్నతస్థాయి అధికారులకు తెలియకుండా దాచే ప్రయత్నం చేసిందని వెల్లడించింది. ఈ అంశంపై అమెరికాకు చెందిన న్యాయశాఖ మరియు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజి కమీషన్‌లు దర్యాప్తు ప్రారంభించాయి.

ఈవిధమైన నీతిబాహ్య పద్ధతులలో ప్రపంచంలో తన మార్కెట్లను విస్తరించటం ద్వారా 2018 ఆర్థిక సంవత్సరంలో వాల్‌మార్ట్ సంస్థ 700 కోట్ల డాలర్ల లాభాలను గడించింది. అమెరికా ప్రభుత్వం చేసిన దర్యాప్తులో వాల్‌మార్ట్‌పై సివిల్, క్రిమినల్ ఆరోపణలు న్యాయమైనవేనని, వాల్‌మార్ట్ దోషి అని రుజువైంది. కానీ వాల్‌మార్ట్ యాజమాన్యం ఈ నిర్ధారణలను తోసిపుచ్చింది. అమెరికా న్యాయ చట్టాలననుసరించి తాను సవ్యంగా పని చేస్తున్నానని బూకరించింది. న్యాయస్థానంలో తనపక్షాన వాదించే న్యాయవాదులకు, తదనుగుణమైన కార్యకలాపాలకు వాల్‌మార్ట్ సంస్థ షుమారు 90 కోట్ల డాలర్లను ఖర్చుచేసింది. సరుకులు తనవద్ద 'చౌకధరలకు లభిస్తాయనే' నినాదంతో త్వరత్వరగా తన మార్కెట్లను విస్తరింపజేసుకునే ప్రయత్నంలో, ఈ నీతి బాహ్యమైన పద్ధతులకు, అవినీతికి లంచాలు ఇచ్చేదానికి పాల్పడింది.

"వాల్‌మార్ట్ సవ్యమైన పద్ధతుల్లో వ్యాపారం చేయటానికి కట్టుబడి వుంది. అంటే దాని అర్థం, మార్కెట్లను విస్తరించిన అన్ని ప్రాంతాలలో సవ్యంగా, సరైన పద్ధతుల్లో వ్యవహరిస్తూ వస్తున్నాము" అని ఒకవైపున వాల్‌మార్ట్ యాజమాన్యం ప్రకటించుకుంటూనే, మరోవైపున పైన పేర్కొన్న అవినీతికర, నీతి బాహ్య విధానాలతో అది సూపర్ లాభాలను గడిస్తోంది.

వాల్‌మార్ట్ తన తప్పిదం లేదని ఎంతగా వాదించినప్పటికీ, సివిల్, క్రిమినల్ ఆరోపణలతో దోషిగా రుజువై, ఇక తప్పించుకునే మార్గం లేక, 28 కోట్ల 20 లక్షల డాలర్లను పరిష్కారంగా చెల్లించటానికి సిద్ధపడింది. ఇది చెల్లించకుంటే 60 కోట్ల డాలర్లను జరిమానాగా చెల్లించవలసి వచ్చేది.

వివిధ న్యాయవ్యవస్థలు, రాజకీయ సంస్కృతులుగల ప్రపంచదేశాలలోకి విస్తరించటం ద్వారా లాభాలను రెట్టింపు చేసుకోవాలను కుంటున్న అమెరికా బహుళజాతి కార్పొరేషన్‌ల దుర్మార్గాలను, పై కేసు బాగా వెల్లడి చేస్తోంది.

పెట్టుబడిదారీ వ్యవస్థలో పైకి ఎంత గొప్పగా, బడాయిగా మాటలు చెప్పినప్పటికీ, మానవజాతిని, నీతిబాహ్యంగా దోచుకుని, మోసగించే లక్షణం ఆ వ్యవస్థలోనే వుంది. పెట్టుబడిదారీవ్యవస్థ వర్గస్వభావం దోపిడీనే.